క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని సింగపూర్, గుత్తదరపల్లి, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు సోమవారం మంచిర్యాల కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. గోదావరి నీరు అందించడం లేదని, డ్రెయినేజీలు లేక, మురుగు నీరు నిలుస్తుందని, కమాన్‌బోర్డు ఏర్పాటు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మించాలని, కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎ.సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, ఉపాధ్యక్షులు ఏ.మల్లేశ్, ఇండ్ల మల్లేశ్, కోశాధికారి ఏ.శ్రావణ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిష్టయ్య పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్ శిబిరం


టీబీ పరీక్షలు చేస్తున్న వైద్యులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల గ్రామంలో సోమవారం అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ శిబిరం నిర్వహించారు. మొత్తం 101మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు నిహారిక, సబ్ యూనిట్ అధికారి జగదీశ్, టీబీ సూపర్‌వైజర్ అశోక్, ఎంఎల్‌పీహెచ్ లావణ్య, ఏఎన్‌ఎం శంకరమ్మ పాల్గొన్నారు.

ఓటరు నమోదు విజయవంతం చేయండి


మాట్లాడుతున్న రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రకళ

భీమారం: ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెన్నూర్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి చంద్రకళ కోరారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సోమవారం బూత్ లెవల్ అధికారులకు ఓటరు నమోదుపై శిక్షణ ఇచ్చారు. 18సంవత్సరాలు నిండిన యువతీ, యువకుల పేర్లు ఓటర్లుగా నమోదు చేయాలని ఆదేశించారు. బీఎల్‌వోలు ప్రజలను చైతన్య పర్చాలని సూచించారు. ఫాం నంబరు 6, 6ఏ, 7, 8లను ఎలా నింపాలనేది ట్రైనర్ షరీఫ్ వివరించారు. తహసీల్దార్ సదానందం, నాయబ్ తహసీల్దార్ అంజమ్మ, సూపర్‌వైజర్ రంజిత్ పాల్గొన్నారు.

పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలి

కోటపల్లి: పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తుడుం దెబ్బ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఐటీడీఏ కార్యాలయ ఏవో దామోదరస్వామికి వినతిపత్రం అందజేశారు. బ్రహ్మణపల్లిలో ఆదివాసీ రైతులు ఎన్నో ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు కలిగి ఉన్నప్పటికీ భూములు సాగు చేసుకుంటున్న పోడు రైతులను అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్, ఉపాధ్యక్షుడు బండి రమేశ్, చెన్నూర్ మండల అధ్యక్షుడు జైలు, రాష్ట్ర నాయకులు మాంతయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గోరింటా సందడి


గుడిపేటలో గోరింటా సంబురాలు

తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆషాఢ మాసం సందర్భంగా సోమవారం తాండూర్ వాసవిక్లబ్ ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట మహిళా సమాఖ్య భవన్‌లో మహిళలు గోరింటాకు సంబురాలు జరుపుకున్నారు. ఆడపడుచులకు పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు వాయనంగా ఇచ్చిపుచ్చుకున్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చిందం త్రిలోక్య, సల్లం లోహిత బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయురాలు వి.సుధారాణి, ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు.

లక్సెట్టిపేట: జెండావెంకటాపూర్‌లో మొహర్రం



రామకృష్ణాపూర్: వేడుకల్లో పాల్గొన్న భక్తులు



వేమనపల్లి: వేడుకల్లో పాల్గొన్న భక్తులు



భక్తిశ్రద్ధలతో మొహర్రం

జిల్లా వ్యాప్తంగా మొహర్రం వేడుకలను ప్రజలు కులమతాలకు అతీతంగా భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పీరీలను వీధుల్లో ఊరేగించారు. మటికీలు తీశారు. భక్తులు పూలదండలు, కుడుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. - సాక్షి నెట్‌వర్క్

తొలగని అనిశ్చితి!

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటులో జాప్యం
- జాడలేని మంజూరు ఉత్తర్వులు
- ఇప్పటికే ప్రారంభమైన విద్యా సంవత్సరం
- నిరాశ చెందుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులు


OFFICE OF THE DIRECTOR OF INTERMEDIATE EDUCATION

ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వు ప్రతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కొత్తగా మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటుపై అనిశ్చితి ఏర్పడింది. తాండూర్, వేమనపల్లి, నెన్నెల మండలాల్లో ఏర్పాటు చేయడానికి సాధ్యసాధ్యాలను పరిశీలించి నివేదికను పంపించాల్సిందిగా గత జనవరి నెలలో రాష్ట్ర ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయిన సంగతి తెలిసిందే. జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి(డీఐఈఓ) కార్యాలయం నుంచి ఫ్యూజిబులిటీ రిపోర్టు పంపించి నెలలు గడుస్తున్నా, మంజూరు ఉత్తర్వులు జారీ కాలేదు. ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేయడంతో దశాబ్దాల కల నెరవేరబోతోందని ఆయా మండలాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతగానో సంబురపడ్డారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయని ప్రచారం చేస్తూ, కాంగ్రెస్ శ్రేణులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఆనందపడ్డారు. ఆ సంతోషం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ప్రారంభిస్తారని ఆశించినా, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నిరాశను మిగిల్చింది. ఫ్యూజిబులిటీ రిపోర్టు ప్రభుత్వానికి సానుకూలంగా పంపించినప్పటికీ మంజూరు ఉత్తర్వుల జాడ లేకుండా పోవడంతో ఎప్పటి మాదిరిగానే ఈ సారి కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితులు, ఆయా మండలాల విద్యార్థులకు ఏర్పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ నుంచి అనుమతి వస్తేకానీ ఆయా మండలాల్లో జూనియర్ కళాశాలలు మంజూరయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

కళాశాలల్లో చేరిన విద్యార్థులు...

ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే ఈసారి కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఇప్పట్లో మంజూరయ్యే పరిస్థితులు కనిపించడం లేదనే వేదన గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో వ్యక్తమవుతోంది. వాస్తవానికి ప్రస్తుత విద్యాసంవత్సరం ఆరంభానికి ముందస్తుగానే మంజూరు ఉత్తర్వులు విడుదలైనట్లైతే ఆయా మండలాల్లో కళాశాలలను ఏర్పాటు చేయడానికి అవకాశాలు ఉండటంతో పాటు విద్యార్థుల ప్రవేశం కూడా జరిగేది. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన గ్రామీణ విద్యార్థులు ఈ పాటికే ఇతర ప్రాంతాల జూనియర్ కళాశాలల్లో చేరారు. ఇంకాస్తా ఆలస్యంగా మంజూరు ఉత్తర్వులు వెలువడినా, కళాశాలల్లో విద్యార్థుల చేరిక ఈసారి ఉండకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎమ్మెల్యేపైనే భారం..

గ్రామీణప్రాంతాల్లో జూనియర్ కళాశాలల మంజూరు అంశం పూర్తిగా ఎమ్మెల్యే గడ్డం వినోద్‌పై ఆధారపడి ఉంది. ఎంతో పట్టుదలతో కృషి చేసి ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నుంచి ఫ్యూజిబులిటీ రిపోర్టు కోసం ఉత్తర్వులు జారీ చేయించినప్పటికీ ఆ తర్వాత మరో అడుగు ముందుకు పడలేదు. డీఐఈవో కార్యాలయం పంపించిన ఫ్యూజిబులిటీ రిపోర్టు ఆధారంగా కళాశాలల మంజూరు ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉంది. ఇందుకోసం ఎమ్మెల్యే చిత్తశుద్ధితో ప్రయత్నాలు సాగిస్తే తప్పా, సాధ్యపడే అవకాశాలు లేవు.

ఫ్యూజిబులిటీ రిపోర్టు పంపించాం..

తాండూర్, వేమనపల్లి, నెన్నెల మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటుకు సంబంధించి ఫ్యూజిబులిటీ రిపోర్టును పాజిటివ్‌గా పంపించాం. కానీ ఇంతవరకు మంజూరు ఉత్తర్వులు జారీ కాలేదు. ఆర్థిక శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయితే తప్పా, కళాశాలలు ఏర్పాటయ్యే అవకాశాలు ఉండవు.
– ఏ.అంజయ్య, డీఐఈఓ, మంచిర్యాల

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి


మాట్లాడుతున్న కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు

శ్రీరాంపూర్: కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వేదిక నాయకులు మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను నేడు కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాల పేరుతో హరిస్తుందన్నారు. కొత్త చట్టాలు అమలైతే కార్మికులపై పనిభారం పెరుగుతుందన్నారు. లేబర్ కోడ్‌లను నిలిపివేసే వరకు కార్మిక వర్గం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో వేదిక నాయకులు హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి పొనగంటి అశోక్, ఫిట్ కార్యదర్శి వినయ్, నాయకులు పాల్గొన్నారు.

'సార్వత్రిక సమ్మెతో గుణపాఠం చెప్పాలి'

బెల్లంపల్లి: సమ్మెను దిగ్విజయం చేసి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్మిక వ్యతిరేకమైన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఆందోళనలు సాగిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, తిరుపతి గౌడ్, కుక్కల ఓదేలు, ఎస్.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్: ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఆర్పీ 3, 3ఏ గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బ్రహ్మానందం, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సారయ్య, నాయకులు మల్లన్న, శేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఏరియాలోని వర్క్‌షాపులో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

అధికారులకు సమ్మె నోటీసులు

భీమారం/తాండూర్: కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే విధంగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్, సహాయ కార్యదర్శి దాగం రాజారామ్ కోరారు. సమ్మెకు సంబంధించిన నోటీసులను సోమవారం తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అనిల్‌కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు లక్ష్మీప్రసన్న, ఏపీఎం పోమా నాయక్‌లకు, భీమారంలో ఎంఈవో గోపాల్‌రావుకు వేర్వేరుగా అందజేశారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


దండేపల్లి: నినాదాలు చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి/పాతమంచిర్యాల/దండేపల్లి/జన్నారం/భీమిని/తాండూర్/మందమర్రిరూరల్/భీమారం/జైపూర్/వేమనపల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని సోమవారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మాదిగ చైతన్య ర్యాలీలు నిర్వహించారు. ఊరూరా ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ సాధించిన వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో దండేపల్లిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగరపు మురళి కృష్ణ, జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, జైపూర్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మూల రాజిరెడ్డి, పట్టణ, మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

వామపక్ష పార్టీల ఆందోళన

- జీవో నం.282 రద్దు చేయాలని డిమాండ్
- జిల్లా కేంద్రంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: కార్మిక చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల 8గంటల పని విధానం స్థానంలో కార్మికులు 10గంటలు పనిచేయాల్సి వస్తుందని వామపక్ష, జాతీయ కార్మిక సంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో సోమవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, టీయూసీఐ జాతీయ కార్మిక సంఘాల నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ, జీవో నం.282 పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్‌దీపక్‌కు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు.

శ్రీరాంపూర్: నస్పూర్‌లోని హమాలీ యూనియన్ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జీఓ 282ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు ఎల్లయ్య, రాజు, సాయి, కిరణ్, రాజన్న, రమేశ్‌లు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 282వెంటనే వెనక్కు తీసుకోవాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే 7, ఆర్కే న్యూటెక్ గనులపై గేట్ మీటింగ్ నిర్వహించారు. సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షులు శంకర్‌రావు మాట్లాడారు. సమ్మెలో కార్మికవర్గం పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు రమేష్, నాయకులు పాల్గొన్నారు.

పోచమ్మ విగ్రహం ధ్వంసం


దుండగులు ధ్వంసం చేసిన పోచమ్మ విగ్రహం

తాండూర్: మండలంలోని అచ్చలాపూర్ గ్రామపంచాయతీ కొమ్ముగూడెంలో అపచారం చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన పోచమ్మ తల్లి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామ సమీపంలోని చెరువు కట్ట వద్ద చెట్టు కింద పోచమ్మ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తులు పూజలు చేస్తున్నారు. ఆలయంలో పోచమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు గ్రామస్తులు ఏర్పాటు చేసుకుంటున్న సమయంలో, అమ్మవారి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇటీవల ఓ రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిని హాజీపూర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం ప్రకారం.. పాతమంచిర్యాలకు చెందిన కార్ల మల్లేశ్ తన గేదెలను నిర్లక్ష్యంగా వదిలిపెట్టగా జాతీయ రహదారిపైకి వచ్చాయి. ఆ గేదెలకు కారు ఢీ కొని పూర్తిగా ధ్వంసం కాగా, కారు యజమాని ప్రాణాలతో బయటపడ్డాడు. మల్లేశ్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరగడంతో మరోసారి అలాంటి తప్పు చేయకుండా తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేశారు. కాగా మరోసారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రూ.1లక్ష జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష ఉంటుందనే షరతు కింద సంవత్సర కాలపరిమితితో బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్థానిక ఆస్పత్రుల్లోనే స్కానింగ్ చేయాలి


మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్కానింగ్‌కు వచ్చే వారికి స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ జరిగేలా చూడాలని, అందరినీ జిల్లా కేంద్రానికి పంపిస్తే స్కానింగ్ చేయడం కష్టమవుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన జిల్లాలోని వైద్యులు, రేడియాలజిస్టులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్సెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో స్కానింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, రేడియాలజిస్టులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రుల్లో స్కానింగ్ మిషన్లు అవసరమయ్యే వారు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రరెడ్డి, వైద్యులు కోటేశ్వర్‌రావు, భీష్మ, కృపాబాయి, రవి, సుధాకర్‌నాయక్, దేవేందర్‌నాయక్, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయులకు 10న ఇంటర్వ్యూ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిలో బోధించేందుకు అతిథి అధ్యాపకుల నియామకానికి ఈ నెల 10న గురువారం డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంజేపీ గురుకులాల ఉమ్మడి జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో తెలుగు (జనరల్-1, జేఎల్ జనరల్-1), హిందీ(మహిళ-1), ఇంగ్లిష్(జనరల్-1), గణితం(జనరల్-1, మహిళ-2, జేఎల్ జనరల్-1), సోషల్(జనరల్-1), జువాలజీ(జేఎల్ మహిళ-1, జేఎల్ జనరల్-1), ఎకనామిక్స్(జేఎల్ మహిళ-1), కామర్స్(జేఎల్ జనరల్-1) సబ్జెక్టులు బోధించుటకు అర్హులైన అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ), బీఈడీ పూర్తి చేసి ఉండాలన్నారు. టెట్ అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు జిల్లాలోని లక్సెట్టిపేట బాలుర పాఠశాల, ఎంజేపీ పాఠశాలలో ఉదయం 9 గంటలకు తమ పూర్తి బయోడేటా, విద్యార్హతల జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

శుభ్రతతో సీజనల్ వ్యాధులు దూరం

శ్రీరాంపూర్: పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధుల భారిన పడకుండా దూరంగా ఉండవచ్చని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ ఓసీపీలో సోమవారం ఆయన కార్మికులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓసీపీ ప్రాజెక్టు అధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు, మేనేజర్ శ్రీనివాస్, రక్షణాధికారి శ్రీధర్, సంక్షేమ అధికారి ఓంకార్‌బాబు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతినిధి చంద్రమోహన్, సత్తయ్య పాల్గొన్నారు.

పోస్టుమ్యాన్‌ను సస్పెండ్ చేయాలి

తాండూర్: విధి నిర్వహణలో తీవ్ర అలసత్వం వహిస్తున్న తాండూర్ మండలం మాదారం పోస్టుమ్యాన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని నర్సాపూర్ గ్రామ గిరిజనులు కోరారు. మంచిర్యాల జిల్లా పోస్టు మాస్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉత్తరాలను, పాన్ కార్డులను, డ్రైవింగ్ లైసెన్స్‌లను, ఆర్‌సీ బుక్‌లను అందజేయకుండా మాదారం పోస్టుమ్యాన్ నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆరోపించారు. విధుల్లో బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తున్న పోస్టుమ్యాన్‌ను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బాబురావు, మారుతిరావు,చిన్ను, సాయికుమార్, సురేష్ ఉన్నారు.

దరఖాస్తుల వెల్లువ

తాండూర్: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న మూడు పోస్టుల భర్తీ కోసం ఆశావహుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. అసిస్టెంట్ కుక్ పోస్టు కోసం 23మంది, డే వాచ్ ఉమెన్ పోస్టు కోసం 80మంది, స్వీపర్/స్కావెంజర్ పోస్టు కోసం ముగ్గురు దరఖాస్తులు చేసుకున్నారు. రెండు రోజుల్లో దరఖాస్తులు పరిశీలించి మెరిట్ ఆధారంగా ఖాళీల భర్తీ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఎంఈవో మల్లేషం తెలిపారు.

రేపు పోచమ్మ బోనాలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక హమాలీవాడ కట్ట పోచమ్మతల్లి బోనాల జాతర ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు నల్ల శంకర్ తెలిపారు. జాతరకు ప్రతి ఇంటి నుంచి బోనంతో తరలివచ్చి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ జోగిని నిషా క్రాంతి జాతరలో పాల్గొని బంగారు బోనంతో అమ్మవారికి తొలి బోనం సమర్పిస్తారన్నారు. మాజీ కౌన్సిలర్లు ప్రభాకర్, రాజు, రవీంద్రరావు, సభ్యులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని వినతి

భీమారం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మంచినీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

రేపు లాటరీ ద్వారా ఇళ్ల కేటాయింపు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎంపికైన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు ఈ నెల 9న లాటరీ పద్ధతి ద్వారా ఇంటి నంబర్లు కేటాయింపు జరుగుతుందని మందమర్రి తహసీల్దార్ సతీష్ తెలిపారు. సింగరేణి ఆర్‌కేసీఓఏ క్లబ్‌లో బుధవారం ఉదయం 10గంటల నుంచి లాటరీ తీసి నంబర్లు కేటాయిస్తామని, లబ్ధిదారులు మాత్రమే లాటరీ నిర్వహించే ప్రాంగణంలోనికి అనుమతించబడుతారని తెలిపారు.

డీటీవోకు వినతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో ఫిట్‌నెస్ లేని విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేసి సీజ్ చేయాలని యూఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. డీటీవో సంతోశ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.